క్లుప్తంగా

కాంగ్రెస్‌కు మద్దతు



పర్వతగిరి : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకే మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ అంబేద్కర్ సంఘం (టీఏఎస్) ప్రకటించింది. ఈ మేరకు కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం చేయాలని తీర్మానించి తీర్మాన కాపీని సంఘం రాష్ట్ర ప్రతినిధులు గాంధీభవన్‌లో సీనియర్ ఉపాధ్యక్షుడు టి.కుమార్‌రావుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతరాజు లాలయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొరంద స్వామి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కూడా..



నర్సంపేట : పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి మెట్టుపల్లి కొమురయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడ్డూరి కుమారస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆకులపెల్లి ఉప్పలయ్య తెలిపారు. ఈ మేరకు వారు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని మంగళవారం కలిసి మద్దతు ప్రకటించి మాట్లాడారు. మహబూబాబాద్ ఎంపీగా పోరిక బలరాం నాయక్ గెలుపునకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, దుగ్గొండి మండల గౌరవ అధ్యక్షుడు నల్ల బాబు, చెన్నారావుపేట మండల ఉపాధ్యక్షుడు మట్టివాడ మస్తాన్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రచారం



పర్వతగిరి : వరంగల్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మారపెల్లి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండలంలోని అన్నారం షరీఫ్‌లో ఆ పార్టీ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి ఓటు అభ్యర్థించారు.

అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని కొనసాగించాలి



పర్వతగిరి : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని కొనసాగించాలని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్పీ) జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ కోరారు. దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి కుమార్ నివాళులర్పించి మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో బూర్జువా పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలు పోరాడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ కట్ట వీరభద్రయ్య, అంబేద్కర్ ఫెలోషిప్ అవార్డు గ్రహీత బిర్రు కుమారస్వామి, గీత కార్మిక సంఘం మండల కన్వీనర్ దొమ్మటి వీరస్వామి, మాదిగ బహుజన మండల కన్వీనర్ దుబారా సురేందర్ పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



రాయపర్తి : మండలంలోని బంధనపల్లి మాజీ సర్పంచ్ చెవ్వ సంపత్ (50)గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి పరామర్శించారు. సంపత్ మృతి బాధాకరమన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన గాదగోని సదయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంగళవారం పరామర్శించారు. తొలుత సదయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే మాధవరెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్య, నాయకులు రమేశ్, మల్లయ్య, బొంత శ్రీను, శోభన్, ఈర్యనాయక్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

● నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



చెన్నారావుపేట : కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

చెన్నారావుపేట : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ గెలుపు కోసం మండల కేంద్రంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తినాయక్ తండా మాజీ సర్పంచ్ స్వామినాయక్, సూర్యాపేట తండా మాజీ సర్పంచ్ కిషన్‌నాయక్, రాములు, అమీనాబాద్ సొసైటీ బీఆర్‌ఎస్ డైరెక్టర్, పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెన్నారావుపేటలో తాను చేసిన అభివృద్ధి తప్ప ఆయన చేసింది ఏమిలేదన్నారు. పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్లు సిద్ధన రమేశ్, తప్పెట రమేశ్, కేతిడి వీరారెడ్డి, మంచాల సదయ్య, రమేశ్, తూటి పావని పాల్గొన్నారు.

ఏకకాలంలోనే రుణమాఫీ చేసిన ఘనత

నెక్కొండ : దేశంలో మొట్ట మొదటిసారి ఏకకాలంలో రైతు రుణమాఫీ చేసిన కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. సూరిపల్లిలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే దొంతి మాట్లాడారు. ఆగస్టు 15 కల్లా రాష్ట్రంలో రూ. 2లక్షల రైతు రుణమాఫీ పక్కగా అమలవుతుందని స్పష్టం చేశారు. అనంతరం సూరిపల్లి పీఏసీఎస్ చైర్మన్ ఘంటా దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సింగారపు గీత భాస్కర్‌రాజు, మాజీ ఉప సర్పంచ్ చుక్క ఐలయ్య, చీకట మధు, శివరాత్రి సురేశ్, కొలిపాక వెంకన్న, సింగం సమ్మయ్య, కాటి భాస్కర్, శివరాత్రి కొమురయ్యతోపాటు మరో 40 కుటుంబాలు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరాయి. టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, నర్సంపేట మార్కెట్ మాజీ చైర్మన్ పాలయి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు బక్కి అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల హరీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో నిజాయితీ కీలకం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

చెన్నారావుపేట : ఎన్నికల నిర్వహణలో నిజాయితీ కీలకమని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ముక్కెర ఈశ్వర్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని ఆశాజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో ఓటు హక్కుపై అధ్యక్షురాలు కద్దూరి హైమ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఈశ్వర్ మాట్లాడారు. సమాజంలోని ప్రతీఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయి సిబ్బందిగా వీఓఏలు నిబద్ధతతో పూర్తిస్థాయిలో పని చేసి వయో వృద్ధుల, వికలాంగుల ఓటింగ్ 100 శాతం నమోదయ్యేలా కృషి చేయాలని చెప్పారు. రూట్ మ్యాప్‌తో పికపింగ్, డ్రాపింగ్‌తో గుర్తించిన వయోవృద్ధులు, వికలాంగులు ఇతరులపై ఆధారపడకుండా ఓటు వేసేలా ఏర్పాటు చేస్తున్న రవాణా, వీల్ చైర్ సౌకర్యం కల్పిస్తూ విధులు నిర్వహించాలని తెలిపారు. అనంతరం నీతినిజాయితీతో విధులు నిర్వహిస్తామని అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో లక్ష్మీ, సుజాత, స్వరూప, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు కట్టయ్య, మంజుల, శ్రీలత, సిబ్బంది పాల్గొన్నారు.

హస్తం గుర్తుకు ఓటెయ్యండి

● పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి : 'పదిహేను సంవత్సరాలుగా మోసపోతూనే ఉన్నాం.. మళ్లీ మోసపోతే గోసపడతాం.. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించుకుందాం' అని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండలంలోని కేశవాపురం, కొలన్‌పల్లి, ఎర్రకుంటతండా, జింకురాంతండా గ్రామాల్లో మంగళవారం ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కడియం కావ్యను వరంగల్ ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి, పాలకుర్తి ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు ముద్రబోయిన వెంకటేశ్వర్లు, కాంచనపల్లి వనజారాణి పాల్గొన్నారు.

బలరాంనాయక్ గెలుపునకు కృషి చేయాలి



నర్సంపేట: ప్రచారం చేస్తున్న చరణ్, నాయకులు



నర్సంపేట: 11వ వార్డులో..



నర్సంపేట రూరల్ : గురిజాలలో..



చెన్నారావుపేట : ఎల్లాయగూడెంలో..

నర్సంపేట : మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ తరపున బరిలో నిలిచిన పోరిక బలరాంనాయక్ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలని 24వ వార్డు కమిటీ అధ్యక్షుడు కోలా చరణ్, పార్టీ పట్టణ కమిటీ అధికార ప్రతినిధి గుంటి వీరప్రకాశ్ కోరారు. పట్టణంలోని 24వ వార్డులో మంగళవారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో వారు మాట్లాడారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు మోసపూరిత హామీలతో ప్రజలను వంచించాయని తెలిపారు. అందుకే రాష్ట్రంలో ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు పట్టం కట్టారని చెప్పారు. ప్రజాకాంక్ష మేరకు కాంగ్రెస్ పార్టీ అన్ని హామీలనూ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచి కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో సంపూర్ణ అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తరుణంలో పార్టీ అభ్యర్థి బలరాంనాయక్‌కు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పట్టణ కమిటీ మహిళా విభాగం అధ్యక్షురాలు నూనె పద్మ, కార్యదర్శి జానకమ్మ, పార్టీ నాయకులు గద్ద అఖిల్, గద్ద సారంగం, శివకుమార్, కందుల మోహన్, విజయ, కుమారస్వామి, ఈశ్వరమ్మ, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

11వ వార్డులో..

పట్టణంలోని 11వ వార్డులో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చేతి గుర్తుకే ఓటేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో పార్టీ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి సందీప్, మాజీ వార్డు సభ్యులు పేరం బాబురావు, వడ్డే కుమారస్వామి, వడ్డే భాగ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ ఉపాధ్యక్షుడు జూలపల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు బత్తుల రవి, నీరటి శివ, కొత్తగట్టు ప్రశాంత్, పెంచలయ్య, లక్ష్మయ్య, సబ్బాని రాజేందర్, రంజిత్, వడ్డే సదానందం, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని గురిజాలలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రం అచ్చయ్య ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చయ్య మాట్లాడారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ ముందుకు సాగుతోందని చెప్పారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతి మాట్లాడుతూ కాంగ్రెస్‌తో అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయగూడెంలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే చేయబోయే పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు జినుకల కనకమల్లు, బోడ మాణిక్యం తండా గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సునాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు రూపిక శ్రావణ్‌కుమార్, లక్ష్మణ్, భిక్షపతి, రమేశ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించాలి



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న రంగయ్య, నాయకులు

● సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.రంగయ్య

నర్సంపేట : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య కోరారు. ఇండియా కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన బలరాంనాయక్‌ను గెలిపించాలని ఆయన సూచించారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో «బీజేపీ బందీఖాన నుంచి దేశాన్ని విముక్తి చేద్దాం» బుక్‌లెట్‌ను రంగయ్య మంగళవారం విడుదల చేసి మాట్లాడారు. బీజేపీ గడచిన పదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాసిందని తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలనూ తుంగలో తొక్కి సంపన్నులకు లబ్ధి చేకూర్చేలా తప్పుడు విధానాలు అవలంభించిందని చెప్పారు. రైతులకు, కార్మికులకు, అన్ని వర్గాల ప్రజలకూ తీరని అన్యాయం చేసి బీజేపీని చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటించిన బీజేపీకి తగిన రీతిలో గుణపాఠం చెప్పాలని స్పష్టం చశారు. కులాలు, మతాల పేరుతో రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ మనువాదాన్ని తీసుకొచ్చేలా వ్యవహరిస్తోందని ఆందోళన వెలిబుచ్చారు. బీజేపీని ఓడించాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈసంపెల్లి బాబు, కోరబోయిన కుమారస్వామి, భూక్య సమ్మయ్య, జిల్లా కమిటీ సభ్యులు నమిండ్ల స్వామి, ముంజాల సాయిలు, హన్మకొండ శ్రీధర్, అనంతగిరి రవి తదితరులు పాల్గొన్నారు.

కవితకు ఓటేసి కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి



ఖానాపురం : మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాలోతు కవితకు ఓటేసి మోసపూరిత విధానాలతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకుడు, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావు ప్రజలను కోరారు. మండలంలోని ఖానాపురం, తదితర గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మేడిద కుమార్, మాజీ ఎంపీటీసీ పూలునాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలకు ప్రాధాన్యం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పవన్, నాయకులు

● ఎన్ఎస్‌యూఐ నేషనల్ డెలిగేట్ పవన్

నర్సంపేట రూరల్ : కేంద్రంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువత కోసం ఉద్యగ నియామకాలు చేపట్టడానికి తక్షణమే ప్రాధాన్యత ఇస్తామని ఎన్ఎస్‌యూఐ నేషనల్ డెలిగేట్ ఎడమ పవన్, జిల్లా ఇన్‌చార్జ్ శివకుమార్ రెడ్డి తెలిపారు. మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం «మహబత్ కి దుకాణ్» కార్యక్రమ వాల్‌పోస్టర్లను నాయకులతో కలిసి పవన్, శివకుమార్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. బీజేపీ నిరుద్యోగ యువతను పూర్తిగా విస్మరించి పదేళ్లపాటు మోసపూరిత పాలన సాగించిందని విమర్శించారు. కాంగ్రెస్ యువజన సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థులను చిత్తుగా ఓడించి కాంగ్రెస్ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యువతకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బేతి భరత్, కటారి ఉత్తం, మంద శివ, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెవాసుల సమస్యలు పరిష్కరించరా?



సమావేశంలో మాట్లాడుతున్న సంధ్య

గీసుకొండ : గుడిసెవాసుల సమస్యలు పరిష్కరించరా? అని రాజకీయ పార్టీల నాయకులను ఏఐఎఫ్‌డీడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కనకం సంధ్య ప్రశ్నించారు. మండలంలోని పోగుల ఆగయ్యనగర్‌లో స్థానికులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజకీయ పార్టీలు గుడిసెవాసులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే గుర్తిస్తూ సమస్యలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. ఆగయ్యనగర్ పేరుతో పేదలు గుడిసెలు వేసుకుని 13 ఏళ్లు గడచినా వారి సమస్యలను రాజకీయ పార్టీలు పరిష్కరించడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా రాజకీయ పార్టీలు గుడిసెవాసుల అన్ని సమస్యలనూ త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాప్రతినిధుల, అధికారుల ఇళ్ల ఎదుట ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు సుశీల, కోమల, శిరీష, తేజస్విని, శైలజ, స్వప్న, స్వర్ణ, గోపిక తదితరులు పాల్గొన్నారు.

బీరన్న ప్రతిష్ఠాపన వేడుకలు



దుగ్గొండి : మండలంలోని తొగర్రాయిలో బీరన్న ప్రతిష్ఠాపన వేడుకలను కురుమ కులస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుడు నెల్లుట్ల సుమన్ బీరన్న కల్యాణాన్ని పురస్కరించుకుని 'ఊడలమర్రిలో ఊగంగా ఉయ్యాలా రావయ్యో బీరయ్య..' అంటూ పాటపాడి ఆడియో, వీడియో రికార్డింగ్ చేసి కురుమ కులస్తులకు బహూకరించారు. ఈ సందర్భంగా సుమన్‌ను కురుమ కులపెద్దలు, ఉత్సవ కమిటీ బాధ్యులు శాలువా కప్పి పూల మాలలతో సన్మానించారు.

కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి

● వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి : కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. నగరంలోని 55వ డివిజన్ భీమారానికి చెందిన వివిధ పార్టీ నాయకుల, కార్యకర్తలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్పొరేటర్ జక్కుల రజిత ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించాలన్నారు. కలిసికట్టుగా పనిచేస్తూ డివిజన్‌లో భారీ మెజారిటీ తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్‌నరిసింహారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడబు సంగాల ప్రేమ్‌కుమార్, సీనియర్ నాయకులు బూర సురేందర్‌గౌడ్, గాజుల గోవర్ధన్ పాల్గొన్నారు.

సామాజిక సేవలకు పెద్దపీట

● 'ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా' అధినేత శ్రీనివాస్‌రెడ్డి



బోరుబావి నల్లాను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : తాను సామాజిక సేవలు అందించడానికి పెద్దపీట వేస్తున్నట్టు ఎస్ఆర్ఆర్ ఇన్‌ఫ్రా సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జయరాంతండాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం తన సొంత డబ్బుతో ఏర్పాటు చేసిన బోరు బావిని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తండావాసులు తాగునీటి కోసం ఇబ్బంది పడుతుండగా బోరుబావి తవ్వించడంతోపాటు మోటార్‌ను బిగింపజేసినట్టు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సామాజిక సేవలు చేయనున్నట్టు చెప్పారు. అనంతరం కేశవాపురంలో దుర్గామాత ఆలయ అభివృద్ధికి రూ.30 వేల విరాళం అందజేశారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



కొత్తగూడ : మండలంలోని పొగుళ్లపల్లిలో ఆటోలో తరలిస్తుండగా 4.5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకుని ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై దిలీప్ తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చీటింగ్ కేసులో ఒకరి రిమాండ్

ఖిలా వరంగల్: కొనుగోలుదారులకు భూమి పత్రాలు ఇవ్వకుండా, అదనపు డబ్బులు ఇవ్వాలని వేధించి చంపుతానని బెదిరింపులకు పాల్పడిన ఒకరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రంగశాయిపేట రాంగోపాలపురానికి చెందిన దోమ రమేష్‌కు శంభునిపేట నాగేంద్రనగర్ కాలనీలో 625.86 గజాల స్థలంలో సామిల్ మిల్లు ఉంది. హనుమకొండ వికాస్‌నగర్‌కు చెందిన ప్రతాపగిరి గోవర్ధన్ రెండేళ్ల క్రితం రమేశ్‌కు కొన్ని డబ్బులు చెల్లించి సామిల్ మిల్లుతోపాటు 625.86 గజాల స్థలం కొనుగోలుకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. గోవర్ధన్ మధ్యవర్తిగా వ్యవహరించి రమేష్ స్థలాన్ని రూ.2.36 కోట్లకు ప్రతాపగిరి స్వేత ధనలక్ష్మీకి 2023లో విక్రయించి రిజిస్ట్రేషన్ చేశారు. కొనుగోలు చేసి ఏడాది గడిచినా భూమిని అప్పగించకుండా ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ ఇవ్వకుండా స్వేత ధనలక్ష్మిపై బెదిరింపులకు పాల్పడడంతో బాధితులు మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గోవర్ధన్‌పై చీటింగ్ కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరు పర్చగా జడ్జి ఆదేశాలతో ప్రతాపగిరి గోవర్ధన్‌ను పరకాల సబ్ జైలుకు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కరీమాబాద్‌లో కోతుల పట్టివేత

ఖిలా వరంగల్ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని 40వ డివిజన్ కరీమాబాద్ వీధుల్లో గత కొంత కాలంగా కోతులు హల్‌చల్ చేస్తున్నాయి. స్థానిక ప్రజలు చేతిలో కర్ర లేకుండా బయటకు రాలేదని పరిస్థితి నెలకొంది. డోర్ తీస్తే ఇంట్లోకి కోతులు ప్రవేశించి నిత్యావసర సరుకులను చిందర వందర చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రజలు స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవిని కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కార్పొరేటర్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కోతులను పట్టి నగరానికి దూరంగా తరలించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఉర్సుగుట్టకు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని కోరారు. ఎండలకు చెత్తకు నిప్పు అంటుకుని మంటలు ఎగిసిపడ్డాయని చెప్పారు. డంపింగ్ పక్కనే కోట్ల విలువైన టాటాకార్ల షోరూం ఉందన్నారు. స్థానిక ప్రజల ఇళ్లు ఉన్నాయని, వెంటనే అధికారులు పరిశీలించి డంపింగ్ యార్డ్‌ను తరలించాలని కోరారు. కార్యక్రమంలో బల్దియా సిబ్బంది పాల్గొన్నారు.